# జైలు కథలు 8




గుర్రం జాషువాగారు కీర్తిశేషులైన తరువాత వారి రచనలపై యింకా కోరిక పెరిగింది. దాని ఫలితమే జైలర్‌గారి పర్మిషన్ తీసుకొని 'ఫిరదౌసి' కావ్యాన్ని తెప్పించుకొని చదవసాగాను. చదివినదైనా మరలా ఆపేక్షగా చదువుచున్నాను.

"ప్రసాద్!" తలతిప్పి చూశాను. జైలు వార్డెన్! చిరునవ్వు చిందిస్తూ వున్నాడు. ఏమన్నట్లుచూశాను. "ఈరోజు సూపరెన్టెంటు రౌండు వున్నదట ఖైదీలందర్నీ లైన్‌లో మంచిగా ఫారం కమ్మంటున్నారు జైలర్. క్విక్" అనేసి హడావిడిగా వెళ్ళిపోయాడు. చదువుచున్న పుస్తకాన్ని తలవేపుంచి, బెడ్ చుట్టి బయటకు నడిచాను. దఫేదారు కొంతమంది కానిస్టేబుళ్ళు ఖైదీలను ఫారం చేయడానికి ఆరాటపడుతున్నారు. ఆవరణ అంతా కోలాహలంగా వుంది. నేను వెళ్ళి లైనులో నుంచున్నాను. ప్రక్కకు చూశాను. నా ప్రక్కకువచ్చి నిల్చొన్నాడు షుమారు పాతిక వయసుగల యువకుడు. తల వంచుకొని చాల మౌనంగా వున్నాడు. ముఖం కళావిహీనంగా వుంది. బాగా చదువుకొన్న వాడిలా వున్నాడు.

"మీ పేరు" అడిగాను. "గంగాధర్" ముక్తసరిగావుంది జవాబు. అంతకంటే అతనికి మాట్లాడటం ఇష్టం లేదని గ్రహించి వూరుకున్నాను. ఇంతలో జైలర్, సూపరెన్టెంట్ ఆవరణలో అడుగుపెట్టారు. అప్పటివరకు ఎంతో కోలాహలంగా వున్న ఆవరణ ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారింది. రౌండ్ అయిపోయింది. ఖైదీలందరూ గోలగా వెళ్ళిపోయారు. మెల్లగా నడుస్తున్నాడు గంగాధర్. "మిస్టర్ గంగాధర్" నా పిలుపుకు వెనుదిరిగి చూశాడు. చేయి పట్టుకొని ఏమీ మాట్లాడకుండా నా బ్లాక్‌లోకి తీసికొని వెళ్ళి కూర్చుండబెట్టాను.

"చూడండి గంగాధర్! మీ విచారం సమస్యలకు పరిష్కారం కాదు. సమస్యలకు సతమతమయి, గుండె నిబ్బరాన్ని కోల్పోయేకన్నా ధైర్యంగా పరిస్థితుల్ని సమర్థంగా చక్కదిద్దుకోవాలి." నా మాటలు పనిచేశాయి. కొంచెం మార్పు వచ్చింది ముఖంలో.

"విషయం చెప్పండి కర్తవ్యం ఆలోచిద్దాం."

"……………………"

వనపర్తి ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా వుంటున్నాడు గంగాధర్. బి.యిడి. చేశాడు. అవివాహితుడు. అందగాడు. యిద్దరు చెల్లెళ్ళు పెండ్లికి యెదిగి రావటంతో అతని పెండ్లి వాయిదా వేసుకొన్నాడు. వనపర్తిలో చెప్పుకోదగ్గ పలుకుబడి గలవాడు వెంకటరత్నంగారు. ఆయన ఏకైక పుత్రిక మల్లిక. 10th చదువుతూంది. ఆమెకు ట్యూషన్ చెప్పేవాడు గంగాధర్. వయసు, వయసుతో వంతపాడింది-మనసు, మనసుతో మాటాడుకొంది. కళ్ళు, కళ్ళతో కలుసుకొన్నాయి. ప్రేమ అంకురించింది. ప్రేమ, ప్రేమకు ప్రతి సమాధానం పలికింది.

ఫలితంగా యిద్దరూ నిర్ణయానికి వచ్చారు తిరుపతి వెళ్ళారు. వివాహం చేసుకొన్నారు. తిరిగి మామగారి యింటికి వెళ్ళారు. ఆశీస్సులు కోరారు.

ఆశీస్సులకు బదులుగా వెంకటరత్నంగారు కూతురి మెడలో తాళి త్రెంచి, గంగాధర్‌పై పోలీసు కేసుపెట్టాడు. పలుకుబడి ఉపయోగించాడు. కుమార్తెను బలవంతంగా లేపుకుపోయిన నేరం మోపాడు. ఫలితంగా గంగాధర్ జైలుకు పంపబడ్డాడు.

ఆనాటి నుంచి గంగాధర్‌కు, నాకు పరిచయం ఎక్కువైంది. ప్రతి దినం ఇద్దరం కలుసుకొని కేసు విషయాల చర్చించేవాళ్ళం. నా సలహాపై నేను చెప్పిన వకీలుకు కేసు అప్పగించాడు. కేసు నడుస్తోంది.

సాక్ష్యాలు అన్నీ గంగాధర్‌కు వ్యతిరేకంగా వున్నాయి. అయినా నా మాటలవల్ల గంగాధర్ గుండె నిబ్బరం వహించాడు.

ఆ రోజు ప్రియురాలి సాక్ష్యం వుంది. ఉదయానే భోజనం ముగించి కోర్టుకు వాయిదా వున్నవారితో కూడా వెళ్ళబోయేముందు నావద్దకు వచ్చి చెప్పాడు. నేను బ్లెస్ చేశాను. సాయంకాలంవరకు అసహనంగా కాలం గడిపాను. సాయంకాలం ఆరు గంటలైంది. గంగాధర్ అంతదూరంనుంచే పరుగెత్తుకుంటూ వచ్చి నన్ను ఆనందాతిశయంతో కౌగలించుకున్నాడు. సంతోషంతో నన్ను వుక్కిరి బిక్కిరిచేశాడు. విషయం గ్రహించాను. కాని అతని నోటినుంచే వినాలనుకున్నాను.

"ఏమైంది?"

"సాక్షిగా మల్లికను కోర్టులో ప్రవేశపెట్టారు. పి.పి.సి (పబ్లిక్ ప్రాసిక్యూటర్) అడిగాడు. గంగాధర్ నిన్ను లేపుకొని వెళ్ళాడుగదాని. ఆమె కాదంది. "తన యిష్టపూర్తిగానే అతనిని ప్రేమించి వెళ్ళాననీ, పెండ్లికూడా అయిందని. ఏనాటికైనా అతనే తన భర్త అని." ఇక యెలాంటివాదన వినాలని లేదన్నాడు మేజిస్ట్రేట్. రెండు దండలిప్పించి అప్పటి కప్పుడు కోర్టు పెళ్ళి జరిపించాడు. మమ్మల్ని ముందు ముందు ఎవరు విడదీయడానికి ప్రయత్నించినా శిక్షింపబడతారన్నాడు.... నన్ను యిపుడు వదలివేస్తారు." అనడంతో కళ్ళవెంట నీరు కారుతూ వున్నాయి గంగాధర్‌కు.

ఆ సంతోషం చూసి నాకూ సంతోషంతో కన్నీళ్ళు వచ్చాయి.

—'ప్రసాద్'